సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



ఉత్సాహంగా 'ఉషా' ఎంపికలు
పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి ఉషా ఎంపికలు ఉత్సాహంగా కొనసాగాయి.
- IIలో▸



డీజేను నిషేధిద్దాం!
ప్రస్తుతకాలంలో డీజేలను విరివిగా వినియోగిస్తున్నారు. డీజే శబ్దంతో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని ఈఎన్‌టీ వైద్యులు చెబుతున్నారు.
- IIలో▸

గరిష్టం/కనిష్టం
$30^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

కాటారం: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేడు(గురువారం) మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు స్థానిక బీఎల్‌ఎమ్ గార్డెన్స్‌లో కాటారం, మహాముత్తారం, పలిమెల, మహదేవపూర్, మల్హర్ మండలాలకు సంబంధించిన 300 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయనున్నారు. 4 మండలాలకు చెందిన లబ్ధిదారులకు 50 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, 90 కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోషణమాసం కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారు.

34 మంది క్రీడాకారులు కోల్ ఇండియాకు ఎంపిక



మిస్టర్ సింగరేణిగా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: గత రెండు రోజుల పాటు భూపాలపల్లి ఏరియాలో నిర్వహించిన సింగరేణి కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 34 మంది క్రీడాకారులను కోల్ ఇండియా పోటీలకు ఎంపిక చేసినట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మిస్టర్ సింగరేణిగా సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, బెస్ట్ స్ట్రాంగ్ మెన్‌గా రమేష్, బెస్ట్ స్ట్రాంగ్ ఉమెన్‌గా దువ్వ అనూష, బెస్ట్ లిఫ్టర్‌గా కోరం అనిల్‌కుమార్‌లు ఎంపికైనట్లు వెల్లడించారు.

యాప్‌ను వినియోగించుకోవాలి

భూపాలపల్లి రూరల్: విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించడంలో భాగంగా టీజీఎన్‌పీడీసీఎల్ 20 ఫీచర్లతో రూపొందించిన యాప్‌ను వినియోగించుకోవాలని భూపాలపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మల్సూర్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆండ్రాయిడ్ మొబైల్‌లో ప్లేస్టోర్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ అనే యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని విద్యుత్ సేవలను వినిగించుకోవాలని సూచించారు.

గాలివాన బీభత్సం

వాజేడు: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఆరు గంటల సమయంలో ప్రారంభమైన గాలివాన సుమారుగా గంట పాటు వచ్చింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలో సుమారుగా 2 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో ఏఈ అర్షద్ అహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది మండల కేంద్రంలో లైన్ల వెంట తిరిగి ఇన్సలెటర్ పెయిల్ అయినట్లు గుర్తించారు. వెంటనే కొత్తది అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు రేవంత్ ఎంపిక

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన పాలకుర్తి రేవంత్‌గౌడ్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో అండర్ -19 జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 27న ఉత్తరాఖండ్‌లో హరిద్వార్‌లో జరిగే టోర్న మెంట్‌లో పాల్గొననున్నట్లు కోచ్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా కాటాపూర్ గౌడ సంఘం అధ్వర్యంలో కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య, గీత కార్మికులు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి ముజాఫర్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కోడి సతీష్, నాయకులు మద్దూరి రాములు, రహమాన్‌లు రేవంత్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

పాతాళగంగ పైపైకి..



ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి- మేడారం మార్గంలోని రోడ్డుకు కొద్ది దూరంలో అడవిలో భక్తుల తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చేతి పంపు నుంచి నీరు ఉబికి వస్తోంది. మేడారానికి సుమారుగా ఆరు కిలోమీటర్ల దూరంలో ఈ చేతి పంపు ఉంది. మేడారానికి వచ్చిన భక్తులు అడవి ప్రాంతంలో చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకునేందుకు చేతి పంపు నీటితో అవసరాలను తీర్చుకుంటున్నారు. భారీ వర్షాలు కురుస్తుడడంతో భూగర్భజలాలు పెరిగి చేతి పంపు నుంచి పాతాళగంగ వ్యవసాయ బోరు మోటారు పోసినట్లుగా ఉబికి వస్తుడడంతో మేడారానికి వచ్చిన భక్తులు, దారిగుండా వెళ్లే వాహనాదారులు అక్కడ కొద్ది సేపు వాహనాలను నిలిపి చూసి వెళ్తున్నారు.

పట్టు తప్పుతున్న పాలన

అదనపు విధులతో అధికారులపై తీవ్ర ఒత్తిడి
- ఒక్కొక్కరికి నాలుగైదు శాఖల ఇన్‌చార్జ్ బాధ్యతలు
- ప్రత్యేక పాలనలో ప్రజలకు తప్పని ఇబ్బందులు



ఇన్‌చార్జ్ అధికారులు ఉన్న శాఖలు
జిల్లా అదనపు కలెక్టర్(ఎల్‌బీ)
అసిస్టెంట్ లేబర్ అధికారి
డ్రగ్ ఇన్‌స్పెక్టర్
జిల్లా విద్యాశాఖ అధికారి
మిషన్ భగీరథ ఈఈ
ఫుడ్ ఇన్‌స్పెక్టర్
భూగర్భ జలాల అధికారి
హార్టికల్చర్ అధికారి
అగ్రికల్చర్ అధికారి
పరిశ్రమల శాఖ మేనేజర్
తూనికలు, కొలతలు
పంచాయతీ రాజ్‌శాఖ ఈఈ
ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి
మైనారిటీ అభివృద్ధి అధికారి
జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి
జిల్లా టూరిజం అధికారి
జిల్లా సంక్షేమ అధికారి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పాలన పట్టు తప్పుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల, పాలకవర్గాల ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అంతటా ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగుతోంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోయి రెండేళ్లు కావొస్తోంది. అలాగే 8 నెలల క్రితం మున్సిపల్ పాలక వర్గాల పదవీ కాలం కూడా పూర్తి కావడంతో అంతా ప్రత్యేకాధికారులతోనే పాలనను నెట్టుకొస్తున్నారు. అసలే శాఖాపరమైన బాధ్యతలతో సతమతమయ్యే అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఒత్తిడికి గురవుతున్నారు. జిల్లాలో ఏ శాఖలో చూసినా అధికారులు బిజీబిజీగానే కనిపిస్తున్నారు. దీంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్‌చార్జ్ అధికారులకే మళ్లీ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. కొద్దిరోజులుగా వరుసగా సర్వే పనులు, సంక్షేమ పథకాల అమలు పనుల్లోనే అధికారులు నిమగ్నమవుతున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదంటున్నారు. పర్యవేక్షణ కొరవడడంతో కిందిస్థాయి సిబ్బంది చెప్పిందే లెక్కగా మారుతోంది. ముఖ్యంగా జిల్లాలో పలు ప్రధాన శాఖలను ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకు రావడంతో పాలన పట్టుతప్పే ప్రమాదం ఉందంటున్నారు. ఇలాంటి పరిస్థితులతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

అధికారుల ఉరుకులు పరుగులు..

ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు క్షేత్ర స్థాయిలో సర్వేలు చేపడుతోంది. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇటీవల రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్‌బెడ్‌రూం లాంటి పథకాలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే, లబ్ధిదారుల ఎంపిక జాబితాలు తప్పుల తడకగానే ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి. అదనపు విధులతో అధికారులపై ఒత్తిడి పెరిగి పోవడంతోనే ప్రభుత్వానికి సరైన నివేదికలు అందడం లేదని తెలుస్తోంది. అలాగే సరైన గడువులోగా వివిధ రకాల నివేదికలను అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

అధికారుల సతమతం..

ప్రత్యేక పాలన కొనసాగడంతో కొన్ని శాఖల జిల్లా అధికారులకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రామ పంచాయతీ, మండలం, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. ఉదాహరణకు జెడ్పీ సీఈఓ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), మున్సిపాలిటీ, ప్రత్యేక అధికారిగా, మండల ప్రత్యేక అధికారిగా సైతం అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి మైనార్టీ, ఎస్సీ వెల్ఫేర్ శాఖలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. 17 శాఖల్లో ఇన్‌చార్జ్ అధికారులకు ఇన్‌చార్జ్ విధులను అప్పగించడంతో ఏశాఖలోనూ పూర్తిస్థాయిలో పనిచేసిన పరిస్థితి కనిపించడం లేదంటున్నారు. జిల్లా మార్కెటింగ్, టీజీఎంఐడీసీ, ఎక్సైజ్, పరిశ్రమల, లేబర్, మిషన్ భగీరథ, భూగర్భ జలాలు, తునికలు కొలతలు, డ్రగ్స్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సైతం విధులు నిర్వర్తిస్తున్నారు. అదనపు విధులతో అధికారులు సతమతమవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి కార్యాలయాలకు వస్తున్న ప్రజలకు జిల్లా అధికారి అందుబాటులో లేరని చెప్పడంతో నిరాశగా తిరిగి వెళ్లిపోతున్నారు. కనీసం కొందరు అధికారులు ఫోన్‌లోనైనా స్పందించడం లేదని వాపోతున్నారు. ఇలా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పనులు పూర్తి కావడం లేదని వారు పేర్కొంటున్నారు. కార్యాలయ సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. అలాగే, దీనికి తోడు తరుచు వీడియో, టెలికాన్ఫరెన్స్‌లు, వివిధ కార్యక్రమాలతో అధికారులు బిజీబిజీగా మారుతున్నారు.

కొరవడుతున్న పర్యవేక్షణ

ఇన్‌చార్జ్ బాధ్యతలు, అదనపు విధులతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలు సొంత శాఖల పనితీరు పైననే దృష్టి సారించలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కేవలం పని ఒత్తిడి కారణంగానే సొంత శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలను పసిగట్టలేక పోయారన్న చర్చ జరుగుతోంది. అదనపు విధులతో సొంత శాఖ పనులపై కొంత నిర్లక్ష్యమే కనిపిస్తోంది. పలు శాఖల్లో అవినీతి అక్రమాలు జరిగాయంటూ రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. దీంతో ఆయా శాఖల్లో జరుగుతున్న అక్రమాలు, అవినీతిని పసిగట్టలేక పోవడంతోనే పాలన గాడితప్పుతుందన్న విమర్శలు వస్తున్నాయి.

యూరియా అక్రమ రవాణాపై నిఘా

- కలెక్టర్ రాహుల్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: యూరియా అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలని కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. యూరియా సరఫరా, క్రాప్ బుకింగ్, ఉద్యాన పంటలు సాగు తదితర అంశాలపై బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరాపై టాస్క్‌ఫోర్స్ టీంలు పటిష్టమైన నిఘా పెంచాలన్నారు. యూరియా ఎక్కువగా విక్రయాలు జరుగుతున్న మండలాల నివేదిక అందించాలన్నారు. పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులకు సరిపడేంత నిల్వలు ఉంచాలని స్పష్టం చేశారు. యూరియా అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. టాస్క్‌ఫోర్స్ టీంలు ఆకస్మికంగా రిటైల్ షాపుల్లో తనిఖీలు చేపట్టాలని, ప్రైవేటు డీలర్లు కొన్ని చోట్ల బ్లాక్ చేసే అవకాశం ఉందన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో యూరియాకు కొరత లేదన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఆదేశించారు. మొగుళ్లపల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ చేసినట్లు తెలిపారు. ఆ భూముల్లో పంటలు సాగు చేయకుండా, అలాగే సాగులో ఉన్న పంటలు త్వరితగతిన పూర్తి చేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ సమావేశంలో డీఏవో బాబురావు, ఉద్యానవనశాఖ అధికారి సునీల్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏలు, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

- డీఎంహెచ్‌ఓ మధుసూదన్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మధుసూదన్

భూపాలపల్లి అర్బన్: స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మధుసూదన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్ల నిర్వహణపై బుధవారం డీఎంహెచ్‌ఓ తన కార్యాలయంలో జిల్లా మెడికల్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ సెంటర్లతో పాటు ఇప్పటికే ఉన్న స్కానింగ్ సెంటర్ల అనుమతి గురించి అడ్వైజర్ కమిటీ ముందుంచామన్నారు. ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సెక్స్ రేషియో తక్కువగా ఉన్నటువంటి మండలాలు ఒడితల, రేగొండ, కాటారం, చెల్పూర్, మహాముత్తారం, ఆజాంనగర్‌లు, ఏఎన్ఎంలకు విడతల వారీగా సమావేశం నిర్వహించి డాక్యుమెంట్ ఫిల్మ్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి శ్రీదేవి, గైనకాలజిస్టులు కవిత, డాక్టర్ అనీషా, పీడియాట్రిషన్ డాక్టర్ సుధాకర్, సోషల్ వర్కర్ ప్రసాద్, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రావొద్దు

- అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

భూపాలపల్లి: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. ఖరీఫ్ సీజన్ 2025-26 ధాన్యం కొనుగోలు సంసిద్ధతపై వివిధ శాఖల అధికారులతో బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరిధాన్యం సేకరణ కార్యకలాపాలు సజావుగా సాగడానికి అన్ని విభాగాల అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పీపీసీ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ కార్యక్రమాలను ఈ వారంలోపు నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రారంభానికి ముందు రైస్‌మిల్లర్లు అవసరమైన బ్యాంక్ గ్యారంటీలు సమర్పించాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియానాయక్, తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ

రేగొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ రాజేందర్ ఆధ్వర్యంలో వికలాంగులు, చేయూత పింఛన్‌దారుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో వికలాంగులకు, చేయూత పింఛన్‌దారులకు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచాలన్నారు. లేనిపక్షంలో సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్ల పెంపు కోసం పింఛన్‌దారులతో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శ్యాంబాబు, రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి, నాయకులు నోముల శ్రీనివాస్, మంద తిరుపతి, భద్రయ్య, రాజు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే



దసరా ఏర్పాట్లపై అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఏరియాలోని కృష్ణకాలనీలో జరుగుతున్న సింగరేణి కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రతీ సింగరేణి ఉద్యోగి రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత సాధించాలంటే ఆరోగ్యంగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. సింగరేణి ఉద్యోగులు క్రీడలపై ప్రత్యేక దృష్టి పెడితే ఆరోగ్యంగా ఉన్నప్పుడే నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటారని తెలిపారు. భూపాలపల్లి నుంచి కోల్ ఇండియా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ కేటగిరిల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ నరేష్‌నాయక్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా కేంద్రంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో దసరా ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సింగరేణి, మున్సిపల్, పోలీస్‌శాఖ అధికారులను ఆదేశించారు.

పశు జన్యువనరులపై అవగాహన



పాల్గొన్న రైతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న యూనివర్సిటీ వైద్యులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్యశాల ఆవరణలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్ వారు ఐసీఏఆర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు కింద పశు జన్యు వనరులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని పీవీఎన్ఆర్ తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 62 మంది పాడి రైతులు, జీవాల పెంపకం దారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వైద్యులు ఏకాంబరం, సరిన్ కార్తికేయన్, గోపాల కృష్ణమూర్తి, వెంకన్నలు పలు సూచనలు చేశారు. వారికి నాటు పశు సంపద గుర్తింపు ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలు గురించి నిపుణులు సవివరంగా తెలియజేశారు. పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉన్న జాతులను గుర్తించి, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యంతో ఉన్న జాతులను అభివృద్ధి చేసి, వ్యవసాయాన్ని స్థిరంగా నిలుపుకోవచ్చన్నారు. జాతుల చరిత్ర, సంబంధాలు తెలుస్తాయని వెల్లడించారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ పాడి పరిశ్రమకు మరింత ఊతమిచ్చే విధంగా యూనివర్సిటీలోని లాభసాటి పద్ధతులను ప్రత్యక్షంగా సందర్శించడానికి మండల రైతులను ఆహ్వానించినట్లు వెల్లడించారు.గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరించిన మహదేవపూర్ మండల పశువైద్యుడు బుర్ర రాజబాబును మండల రైతులు అందరూ కలిసి ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం, అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు యూనివర్సిటీ తయారు చేసిన మినరల్ మిక్సర్ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గార్లతో పాటు శాఖ సిబ్బంది, గోపాల మిత్రలు, పశుమిత్రలు పాల్గొన్నారు.

ఏఎంవీఐ బాధ్యతల స్వీకరణ



జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వినోద్‌రెడ్డి

ములుగు: జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.వినోద్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్నికైన 102 మందికి పోస్టింగ్ ఇవ్వగా వినోద్‌రెడ్డికి ములుగు జిల్లాను కేటాయించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వినోద్‌రెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నిఖిల్‌రాజ్



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల హ్యాండ్‌బాల్ అకాడమి విద్యార్థి నిఖిల్‌రాజ్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ మినీ సెలక్షన్స్ ట్రెల్స్‌లో నిఖిల్‌రాజ్ ప్రతిభ కనబర్చారు. దీంతో నిర్వాహకులు 17వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ అకాడమి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి లక్ష్మణ్, టీం కోచ్ వెంకటేశ్ వెల్లడించారు. రేపటి నుంచి 29వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో నికిల్‌రాజ్ తెలంగాణ జట్టు తరఫున ఆడనున్నారు. అకాడమి విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికావడం పట్ల ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, పీడీ వెంకటేశ్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, వార్డెన్ బలరాం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు.

బతుకమ్మ సంబురాలు



బతుకమ్మల వద్ద అడిషనల్ కలెక్టర్, మహిళలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయం ఆవరణలో తెలంగాణ టూరిజం, కల్చరల్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సి ఉండగా పర్యటన రద్దు అయింది. దీంతో రాత్రి 7గంటలకు అడిషనల్ కలెక్టక్ విజయలక్ష్మి, డిడబ్ల్యూఓ మల్లీశ్వరీ, డీవైఎస్‌ఏ రఘులు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వర్షం కారణంగా ప్రధాన ఆలయం అనివెట్టి మండపం వద్ద అడిషనల్ కలెక్టర్‌తో కలిసి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలు, అధికారులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో ఆడారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, ఎంపీడీఓ రవీంద్రనాథ్, హరితహోటల్ మేనేజర్ జక్కం సురేష్, సీడీపీఓ రాధిక, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కేటీపీపీలో బతుకమ్మ వేడుకలు..



మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సీఈ శ్రీప్రకాశ్

గణపురం: మండల పరిధిలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కేటీపీపీలో పని చేసే మహిళా ఇంజనీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికులతో పాటు ఇంజనీర్లు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున కేటీపీపీ సర్వీస్ బిల్డింగ్ వద్దకు తరలివచ్చి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఆటపాటలతో సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేటీపీపీ సీఈ శ్రీప్రకాశ్ హాజరై మహిళలతో కలసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

9నుంచి కేయూ ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్అండ్ ఇంప్రూవ్‌మెంట్) అక్టోబర్ 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసిం ఇక్బాల్ బుధవారం తెలిపారు. అక్టోబర్ 9న మొదటి పేపర్, 13న రెండో పేపర్, 15న మూడో పేపర్ పరీక్షలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

డెంగీతో బాలుడి మృతి



శివకుమార్(ఫైల్)

వేలేరు: డెంగీ జ్వరంతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్లలో చోటుచేసుకుంది. బాలుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బక్క రాజు, మమత దంపతుల కుమారుడు శివకుమార్(10)కు నాలుగైదు రోజుల క్రితం జ్వరం రాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. అనంతరం చికిత్స చేస్తున్న క్రమంలో బుధవారం సాయంత్రం మృతిచెందాడు.

పాము కాటుతో మహిళ ..



లక్ష్మి మృతదేహం

వెంకటాపురం(కె): పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండలంలోని కలిపాకలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మిడెం లక్ష్మి(55) మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్ష్మిని వెంకటాపురం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది.

విద్యార్థి ఆత్మహత్య



సిద్ధార్థ (ఫైల్)

వేలేరు: చదువు ఇష్టం లేక ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అజ్మీరా సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన నలివెల శివాజీకి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. కుమారుడు సిద్ధార్థ (20) హైదరాబాద్‌లోని గురునానక్ విద్యాసంస్థల్లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో 5 నెలలుగా కళాశాలకు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. దీంతో తండ్రి పలుమార్లు మందలించినా కళాశాలకు వెళ్లలేదు. కాగా, ఈనెల 23న సిద్ధార్థ తల్లికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో తండ్రి హనుమకొండలోని ఓ ఆస్పత్రికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికి రాగా సిద్ధార్థ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ఇళ్లలో వెతకగా ఎక్కడా కనిపించకపోవడంతో బావివద్దకు వెళ్లి చూడగా అక్కడ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుధవారం తెలిపారు.

> ఇటీవల గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోటాపోటీగా డీజేలు ఏర్పాటు చేశారు. డీజే మోతతో ఊరేగింపు లేకున్నా.. ప్రధాన రోడ్డు ఎక్కే వరకు డీజేలు ఏర్పాటు చేశారు. ఫలితంగా అధిక శబ్దంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ప్రజలు పేర్కొన్నారు. వరంగల్‌లో ఓ ఇంట్లో డీజే శబ్దానికి కిటికీ అద్దాలు ధ్వంసంతోపాటు వస్తువులు కింద పడి పగిలాయి.

> వరంగల్‌కు చెందిన ఓ వ్యక్తి డీజే ఎక్కడుంటే అక్కడ ఉండేవాడు. డీజే పాటలకు నృత్యాలతో సందడి చేయడం అలవాటుగా మారింది. ఈక్రమంలో కొంత కాలానికి అతడికి వినికిడి సమస్య వచ్చింది. ఆస్పత్రికి తీసుకెళ్లి ఈఎన్‌టీ వైద్యుడికి చూపిస్తే డీజే శబ్దాలతో అతడికి చెవుడు వచ్చిందని చెప్పారు.

> వరంగల్ ఫోర్ట్ రోడ్డులో ఓ వ్యక్తి డీజే ఏర్పాటు చేశారు. టెస్ట్ కోసం తరచూగా డీజే మోగిస్తున్నాడు. దీని వల్ల గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి చేరుకున్నాడు. భారీ శబ్దాలకు ఆ వ్యక్తికి గుండె స్పందనల్లో హెచ్చు తగ్గులు వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్తే స్టంట్ వేసి మూడు రోజులు ఐసీయూలో ఉంచి డిశ్చార్జ్ చేశారు. ఆ శబ్దం కొన్ని రోజుల పాటు అతడిని వెంటాడింది.

డీజేను నిషేధిద్దాం!

ఆ శబ్దంతో పెరుగుతున్న గుండె జబ్బులు..

- పలు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం
- నిబంధనలు పట్టించుకోని నిర్వాహకులు
- కనిపించని డీజే నియంత్రణ చర్యలు
- ప్రమాదంలో ప్రజారోగ్యం

ఖిలా వరంగల్: ప్రస్తుతకాలంలో ఊరేగింపులు.. పెళ్లిళ్లు.. జన్మదినాలు.. చావులు.. రాజకీయ పార్టీల సభలు.. ర్యాలీలు.. ఇలా వేడుక ఏదైనా డీజేను విరివిగా వినియోగిస్తున్నారు. ఆయా సందర్భాల్లో కచ్చితంగా డీజే శబ్దాల మోత మార్మోగుతోంది. నిన్న, మొన్నటి వరకు ఎక్కడో హైదరాబాద్ లాంటి మహానగరాలు, పబ్‌లకు పరిమితమైన ఆ సంస్కృతి నేడు నగర, పట్టణాలు, పల్లెలకు చేరింది. ఫలితంగా ఇప్పటికే వాయు కాలుష్యంతో అల్లాడుతున్న జనం.. ప్రస్తుతం ఈ డీజే శబ్ద కాలుష్యం బారిన పడి ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. కాగా, సుప్రీం కోర్టు మార్గదర్శకాల్ని ఉల్లంఘించేలా డీజే శబ్దాలు ఉంటున్నా నియంత్రణకు చర్యలు కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈవిషయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

నిబంధనలు బేఖాతర్..

శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రివెన్షన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సౌండ్ పొల్యూషన్ చట్టాన్ని అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు అధిక శబ్దం చేసే డీజేలు, బాణాసంచా పేల్చడం లాంటి చర్యలపై నిషేధం ఉంది. అయితే ఈ నిబంధన ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. రాత్రి 10 తర్వాతే పెళ్లిళ్లు, జన్మదిన వేడుకలు, రాజకీయ పార్టీల ఊరేగింపుల్లో శబ్దాల మోత దద్దరిల్లుతోంది. ఆ మోతలు చెవులకు చిల్లులు పడుతున్నాయి.

డీజేతో అనర్థాలెన్నో..

డీజే శబ్దంతో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని ఈఎన్‌టీ వైద్యులు చెబుతున్నారు. 85 డెసిబుల్స్ శబ్దం దాటితే వినికిడి, గుండె సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. రక్తపోటు(బీపీ) పెరుగుతుంది. నిద్రలేమితోపాటు ఒత్తిడి పెరిగి మైగ్రేన్ సమస్యలు వస్తాయి. అలర్జీతోపాటు శ్వాస కోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతాయి. తలనొప్పి చికాకుతోపాటు నిద్రలేమి, అలసట ఏర్పడుతుంది. ఎక్కువ కాలం అధిక శబ్దం వినడంతో గుండె జబ్బులు, చెవుడు రావొచ్చు. మానసిక, శారీర కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

ముప్పు గుర్తిద్దాం..

సాధారణంగా మానవుడి చెవులు 120 నుంచి 130 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని భరిస్తాయి. 150 డెసిబుల్స్ వరకు వెళ్తే వినికిడి సమస్యలు వస్తాయి. కర్ణబేరి దెబ్బతినే అవకాశం ఉంది. రక్తపోటు పెరుగుతోంది. డీజే నుంచి వెలువడే వైబ్రేషన్స్‌తో శరీరంలో నాడి వ్యవస్థ దెబ్బతిని మెదడుకు రక్తం సరఫరా తగ్గుతుంది. గుండెకు రక్తం అందించే నాళాలు మూసుకుపోతాయి. ఫలితంగా గుండెకు రక్తం సరఫరా తగ్గి గుండెపోటు వచ్చే అవకాశం ఉందని వైద్యులు పదేపదే చెబుతున్నారు. గర్భిణులు డీజే శబ్దం వింటే గర్భస్థ శిశువు నిద్రకు విఘాతం కలుగుతుంది. తద్వారా పిండం పెరుగుదల, శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. బాలింత, నవజాత శిశువు చెవులకు అధిక శబ్దం చేరితే వినికిడి సమస్యలతో పాటు శరీరంలోని అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. ఎందుకంటే ప్రసవం తర్వాత తల్లి, బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉంటుంది.



వరంగల్ నగరంలో ఓ వేడుకలో డీజే



శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలి



> డీజే శబ్ద కాలుష్యంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. గుండె జబ్బులు, నిద్రలేమి, రక్తపోటు(బీపీ)వినికిడి సమస్యలు అధికంగా వస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలి.
>
> **డాక్టర్ ఎండీ సలీం జనరల్ ఫిజీషియన్, వరంగల్**

గోమాతకు సీమంతం



గోమాత సీమంతానికి ఆహ్వానిస్తున్న సురేందర్ కుటుంబ సభ్యులు

నర్సంపేట: గోవుకు సీమంతం చేసేందుకు అతిథులను ఆహ్వానిస్తున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దాసరిపల్లి గోపాలమిత్రగా పెండ్యాల సురేందర్ 30 ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా చింతగట్టులోని మహర్షి గోశాల నుంచి ఓ గోవును తెచ్చుకుని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో గోవుకు కృత్రిమ గర్భదారణ చేసి సూడి నిర్ధారణ అయిన ఆరు నెలల తర్వాత ఈ నెల 26న సీమంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రకృతిని గౌరవించడంలో భాగంగా గోమాతను సురేందర్, విజయ దంపతులు ఆరాధిస్తున్నారు.

చేపల వలలో చిక్కిన మొసలి



నర్సంపేట: చేపల వలలో మొసలి చిక్కింది. ఈ ఘటన బుధవారం చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మత్స్యకారులు గ్రామంలోని ఊర చెరువులో చేపలు పట్టడానికి వలలు వేశారు. ఇందులో ముత్యాల రాంబాబు వలను బయటకు తీస్తుండగా మొసలి చిక్కింది. దీంతో మత్స్యకారులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

పాపం.. ఆశలు ఆవిరి

- కుంటలో గల్లంతైన యువకుడి మృతి
- శోకసంద్రంలో కుటుంబీకులు



అశోక్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న స్థానికులు

పెద్దవంగర: పాపం.. ఆ కుటుంబీకుల ఆశలు ఆవిరయ్యాయి. తమ ఇంటి పెద్ద బతికొస్తాడని భావించిన వారి కల విషాదమైంది. కుంటలోని స్తంభానికి ఏర్పాటు చేసిన డిష్ కేబుల్ వైర్ మరమ్మతుకు వెళ్లి గల్లంతైన యువకుడు మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన కమ్మగాని అశోక్ (35), కనకతార దంపతులకు శ్రావణి, జశ్వంత్ ఇద్దరు సంతానం. అశోక్ కేబుల్ ఆపరేటర్‌గా, ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఐదుగురితో కలిసి మండలంలోని గంట్లకుంట పరిధిలోని చింతకుంటలో ఉన్న కరెంట్ స్తంభానికి ఏర్పాటు చేసిన డిష్ కేబుల్ వైర్ మరమ్మతుకు వెళ్లాడు. ముందుగా ఇద్దరు వ్యక్తులు తెప్పసాయంతో స్తంభం వద్దకు వెళ్లి మరమ్మతు చేస్తున్నారు. వారికి సహకరించడానికి అశోక్ ఈదుకుంటూ వెళ్లి నీటిలో మునిగాడు. వెంటనే వారు రక్షించే ప్రయత్నం చేసినా అశోక్ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్సై క్రాంతి కిరణ్, తహసీల్దార్ ఘటనాస్థలికి చేరుకుని రాత్రి వరకు రెస్క్యూ టీం, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం అశోక్ మృతదేహం లభ్యమైంది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

2 టన్నుల నల్లబెల్లం పట్టివేత

- 75 కిలోల పటిక, 40 లీటర్ల గుడుంబా స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు



పట్టుబడిన వాహనాలు, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

తొర్రూరు రూరల్: గుడుంబా తయారీకి వినియోగించే నిషేధిత నల్లబెల్లం అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన బుధవారం మండలంలోని హరిపిరాలలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు హరిపిరాల శివారులో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కె. నాగయ్య, నాగేశ్వరరావు, తొర్రూరు ఎక్సైజ్ సీఐ బూస అశోక్ ఆధ్వర్యంలో రూట్ వాచ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. డీసీఎం, కారు అనుమానాస్పదంగా కనిపించగా ఆపి తనిఖీ చేశారు. వాహనాల్లోని 40 బస్తాల్లో 2 టన్నుల నల్లబెల్లం, 75 కిలోల పటిక, 40 లీటర్ల గుడుంబా లభ్యమైంది. దీంతో నిందితులు కొత్తపల్లి సైదయ్య, గుగులోత్ సురేశ్, ఇస్లావత్ విజయ్‌పై కేసు నమోదు చేసి డీసీఎం, కారును సీజ్ చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు చంద్రశేఖర్, రవళిరెడ్డి, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె బస్సులకు పార్కింగ్ స్థలం కేటాయించాలి



'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డితో చర్చిస్తున్న అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం నేతలు

హన్మకొండ : ఆర్టీసీ అద్దె బస్సులకు పార్కింగ్ స్థలం కేటాయించాలని ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లక్కం ప్రభాకర్, వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి కోరారు. హనుమకొండ 'కుడా' కార్యాలయంలో చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిని అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం కలిశారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ కూడలి, సర్క్యూట్ హౌజ్ రోడ్, కాకాజీ కాలనీ ప్రాంతంలో రోడ్డుకిరువైపులా బస్సులను నిలపడం ద్వారా సమస్యలు తలెత్తుతున్నాయని, బాలసముద్రంలోని 'కుడా' స్థలాన్ని కేటాయించాలని చైర్మన్‌ను కోరారు. స్పందించిన చైర్మన్.. వైస్ చైర్మన్, వరంగల్ మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని యజమానుల సంఘం నాయకులు తెలిపారు. 'కుడా' చైర్మన్‌ను కలిసిన వారిలో వెంకటేశ్వర్లు, ఫర్వేజ్, రాజలింగారెడ్డి, సదానందం ఉన్నారు.

డోర్నకల్ వాసికి అరుదైన గౌరవం

- రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న పృథ్వీ



రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందుకుంటున్న పృథ్వీ

డోర్నకల్ : డోర్నకల్‌కు చెందిన ఉప్పరి పృథ్వీకి అరుదైన గౌరవం దక్కింది. జాతీయ ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్‌గా ఎంపికై రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. 2023వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో భాగంగా తెలుగు సినిమా 'హనుమాన్'కు సంబంధించి బెస్ట్ స్టంట్ కొరియోగ్రాఫర్‌గా ఎంపికై ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఉప్పరి శేఖర్, రూపావతి దంపతుల కుమారుడు పృథ్వీ సినీరంగంలోకి ప్రవేశించి సుమారు 50 సినిమాలకు స్టంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేశారు. 'క్లూ' అనే తెలుగు సినిమాలో హీరోగా నటించాడు. పృథ్వీ తండ్రి శేఖర్ కూడా పలు సినిమాల్లో నటించడంతో పాటు స్టంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేసి పలు అవార్డులు అందుకున్నారు. చాలా కాలంగా శేఖర్, పృథ్వీ కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉంటుండగా వీరి కుటుంబ సభ్యులు డోర్నకల్‌లో ఉంటున్నారు.


వైద్య చికిత్సలపై తప్పుడు ప్రచారాలు సరికాదు

- పిల్లల విభాగంలో వెంటిలేటర్లకు బ్యాకప్ సౌకర్యం ఉంది
- ఎంజీఎం పాలన అధికారుల స్పష్టీకరణ

ఎంజీఎం : విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి ఆక్సిజన్ అందక రెండు నెలల బాలుడు చనిపోయాడని సోషల్‌మీడియాలో వైరలైన వార్తను ఎంజీఎం పాలన అధికారులు ఖండించారు. ఈ నెల 21వ తేదీన ములుగు జిల్లా వాజేడు మండలం ఏడుచెర్లపల్లి గ్రామానికి చెందిన నాగారపు గణేశ్, సంధ్య దంపతులు కుమారుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఎంజీఎం ఆస్పత్రిలోని పిల్లల విభాగానికి తీసుకొచ్చారు. సదరు చిన్నారి అడ్మిట్ అయినా పల్స్ రేట్ 35 శాతం మాత్రమే ఉంది. వెంటనే అత్యవసర చికిత్స నిమిత్తం వెంటిలేటర్‌తో చికిత్స అందిస్తూ ఒక్క యూనిట్ రక్తాన్ని సైతం ఎక్కించినట్లు అధికారులు తెలిపారు. కాగా, పరిస్థితి విషమించడంతో బుధవారం చిన్నారి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎంజీఎంలో ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం కలిగిన సందర్భంలో వెంటిలేటర్ల మీద ఉన్న రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతీ వెంటిలేటర్‌కు బ్యాకప్ సౌకర్యం ఉందని ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి స్పష్టం చేశారు.

రైతుకు భరోసా.. కిసాన్ మాన్‌ధన్

- వృద్ధాప్యంలో అన్నదాతకు పింఛన్ ప్రయోజనం



ప్రీమియం చెల్లింపు ఇలా..						
వయస్సు	18-20	21-24	25-29	30-34	35-39	40
ప్రీమియం	రూ.55	61	80	106	150	200

కాజీపేట : అన్నదాతల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. రైతులు వ్యవసాయం చేస్తున్న సమయంలోనే చాలా పథకాలు ఉపయోగపడుతున్నాయి. వృద్ధాప్యంలో రైతులు ఆదాయ మార్గాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అందుకు వయస్సులో ఉండగానే కొంత ప్రీమియం చెల్లిస్తే వృద్ధాప్యంలో ప్రతీ నెల పింఛన్ రూపంలో ఆదాయం అందేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. 60 ఏళ్లు నిండిన రైతులకు ప్రతీ నెలా రూ.3వేల పింఛన్ అందించడం ఈ పథకం లక్ష్యం.

నెలకు రూ.55 మాత్రమే..

18–40 ఏళ్లున్న రైతులు ప్రతీ నెలా వారి వయస్సుల ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18నుంచి 20ఏళ్ల వరకు రూ.55లు చెల్లించాల్సి ఉంటుంది. రైతు రూ.55 చెల్లిస్తే కేంద్రం తన వాటాగా రూ.55 చెల్లించి మొత్తం రూ.110 ప్రీమియం చెల్లిస్తుంది. ఇలా 40 ఏళ్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. 60 ఏళ్ల తర్వాత సంబంధిత రైతుకు నెలకు రూ.3వేల పింఛన్ అందుతుంది. ఒకవేళ రైతు మరణిస్తే వారి నామినికి రూ.1,500 పింఛన్ అందజేస్తారు.

ఎవరు అర్హులు..

18–40 ఏళ్లు ఉండి.. ఐదెకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. సొంత భూమి కలిగి పట్టా పాసుపుస్తకం ఉండాలి. జాతీయ పింఛన్ పథకం (ఎన్‌పీఎస్), ఈపీఎఫ్ పరిధితో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు అనర్హులు.

దరఖాస్తు సులువే..

పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కోసం ఆసక్తి, అర్హత ఉన్న రైతులు సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని రైతు నామిని, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. అనంతరం పింఛన్ కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు నుంచి ప్రీమియం నగదు చెల్లించాలి. ఆధార్ కార్డు, భూమి రికార్డు, బ్యాంకు ఖాతా పత్రాలు ఉండాలి.

అవగాహన కల్పిస్తున్నాం

> కిసాన్ మాన్‌ధన్ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతు వేదికల్లో జరిగే సమావేశాలతో పాటు వ్యక్తిగతంగా తెలియజేస్తున్నాం. ఈ పథకం వృద్ధాప్యంలో ఎంతో ఆసరాగా నిలుస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో సంప్రదించాలి.
>
> – సంతోష్, ఏఓ, కాజీపేట

ఉత్సాహంగా 'ఉషూ' ఎంపికలు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అండర్–17,19 బాలబాలికల ఉమ్మడి జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. హనుమకొండ కాపువాడలోని లవ్‌లీడాల్స్ హైస్కూల్ నిర్వహించిన ఎంపికలో ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వెలిశెట్టి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 35 మంది క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో క్రీడల నిర్వహణ కన్వీనర్ రాయకంటి సుభాష్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం పార్థసారథి, రెఫరీ సంతోష్, కోచ్ ధన్‌రాజ్, ఉషూ సంఘం బాధ్యులు యాకూబ్, రమేశ్, ఆదినారాయణ, రాజు, తిరుపతి, రామకృష్ణ, విజయ్‌కుమార్, సంజీవ, స్నేహిత్, రెబెక్క, కవిత, పీడీ సంతోష, పీఈటీలు పాల్గొన్నారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ



సాంబశివరావు అరెస్ట్ చూపుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: భూవివాదం నేపథ్యంలో అన్నను చంపిన ఘటనలో తమ్ముడిని అరెస్ట్ చేసినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఈమేరకు బుధవారం ఏటూరునాగారంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో భూ వివాదం నేపథ్యంలో అన్నను హత్య చేసిన తమ్ముడు సాంబశివరావు అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. వెంకటాపురం(కె) పీఎస్ పరిధిలోని చిరుతపల్లి గ్రామానికి చెందిన గొంది మాధవరావు, గొంది సాంబశివరావు అన్నదమ్ములు. సాంబయ్య, మాధవరావు తండ్రికి ఇద్దరు భార్యలు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య మధ్య కొంతకాలంగా భూ తగాదాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 22వ తేదీన కూడా గొడవ జరగా కోపోద్రిక్తుడైన సాంబశివరావు అన్న మాధవరావును గడ్డపారతో కొట్టి హత్య చేశాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని ఏఎస్పీ తెలిపారు. కాగా, ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన వెంకటాపురం(కె) సీఐ ముత్యం రమేశ్, ఎస్సై తిరుపతిరావును ఏఎస్పీ అభినందించారు.

స్వదేశీ విధానంతోనే దేశం ముందడుగు

- కేయూ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి



మాట్లాడుతున్న కేయూ ప్రొఫెసర్ ఇస్తారి

విద్యారణ్యపురి/ గీసుకొండ : స్వదేశీ విధానంతోనే దేశం ముందుకెళ్తుందని కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొనసాగుతున్న శతాబ్ది కార్యక్రమంలో భాగంగా ఈ విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో ప్రధానవక్తగా మామిడాల ఇస్తారి మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ స్థాపకుడు హెడ్గేవార్ జీవిత విశేషాలను వివరించారు.స్వాతంత్ర్యానికి ముందే ఆయన కాంగ్రెస్, హిందుమహసభల్లో పాల్గొని దేశానికి సేవచేశారన్నారు. అనేక సార్లు జైలుకెళ్లారన్నారు. కేవలం స్వాతంత్ర్యం సంపాదించుకోవడమేగాకుండా దానిని నిలబెట్టుకునేందుకు మళ్లీ దేశం పరాయి పాలనలోకి వెళ్లకుండా నిరోధించేందుకు స్వయం సేవకులను తీర్చిదిద్దే వేదికగా ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించారని తెలిపారు. సంఘ్ జాతీయ సమైక్యత, సాంస్కృతిక పరిరక్షణ, దేశభక్తి కోసం పోరాడి చారిత్రక విజయాలు సాధించిందన్నారు. విదేశీ వస్తువుల వినియోగంతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. రూపాయి విలువ పడిపోతుందన్నారు. అందుకే స్వదేశీ విధానం అనుసరించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. కాశిబుగ్గ నగర్ సంఘసంచాలక్ చామర్తి ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఎల్లప్పుడూ దేశసేవలో ముందుండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారి రాజు, కోటిలింగాల బస్తీకి చెందిన ఆర్ఎస్ఎస్ బాధ్యులు శ్రీనాథ్, వేణు, గణేశ్, నాగరాజు పాల్గొన్నారు.

కోటీశ్వరులను చేస్తామని కొల్లగొట్టారు..

- రూ.కోట్లు పెట్టుబడిపెట్టి నష్టపోయిన పాలకుర్తి వాసులు
- టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో హెప్సిబా, ఆర్‌జీఎఫ్ నిర్వాహకులు

పాలకుర్తి టౌన్: పాలకుర్తిలో మల్టీలెవల్ మార్కెటింగ్ మోసం వెలుగుచూసింది. నిర్వాహకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన తెప్పలి సైదులు రెండు సంవత్సరాల క్రితం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తాలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నాడు. మొదట రియాల్టీ బిజినెస్ ఫెయిర్ హెల్ప్ సిస్టం (ఆర్‌బీఎఫ్) సంస్థను స్థాపించాడు. నెల రోజుల క్రితం హెప్సిబా మార్కెటింగ్ సంస్థ ఏర్పాటు చేశాడు. కోటీశ్వరులను చేస్తామని ప్రజలను నమ్మించి వారి నుంచి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టించాడు. వీటిలో సభ్యుడిగా చేరే వ్యక్తి మొదట రూ.6 వేలు చెల్లించగానే రూ.2వేల విలువైన నిత్యావసర సరుకుల కిట్ అందించాడు. రెండో నెలలో రూ.వెయ్యి చొప్పున 20 నెలలు ఇస్తామని ప్రజలను నమ్మబలికాడు. దీంతో 10 నెలల కాలంలో ఆ సంస్థల్లో నాలుగు వేల మందిని చేర్పించి రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టించాడు. పెట్టుబడి పెట్టిన వారికి ప్రతినెల అకౌంట్లలో డబ్బులు జమయ్యాయి. అత్యాశతో పేద ప్రజలు అప్పు చేసి ఈ సంస్థల్లో పెట్టుబడి పెట్టారు. ఆర్బీఎఫ్‌లో పెట్టుబడుల కోసం రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో బాధితులు బంగారం తాకట్టు పెట్టారు. బంగారం తాకట్టులో రాష్ట్రంలోనే పాలకుర్తిలోని ఓ ప్రైవేట్ సంస్థ ప్రథమ స్థానం సాధించింది. దినసరి కూలీల నుంచి మధ్యతరగతి కుటుంబాలు, ప్రభుత్వ ఉద్యోగుల వరకు భారీగా బంగారం తాకట్టు పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రజలను నమ్మించేందుకు పాలకుర్తి ఆర్టీసీ బస్టాండ్ పక్కన రూ.కోటితో స్థలం కొనుగోలు చేసి రూ.2 కోట్లతో భవన నిర్మాణ పనులు ప్రారంభించాడు. అనధికారికంగా ఈ సంస్థను నిర్వహించడంతోపాటు మనీలాండరింగ్‌కు పాల్పడినందుకు సైదులుతోపాటు మరో ముగ్గురిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పెట్టుబడి పెట్టినవారు తమ డబ్బులు వసాయోరావోనని ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు.


హెప్సిబా, ఆర్‌జీఎఫ్ నిర్వాహకులు పాలకుర్తిలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న భవనం

పాలకుర్తిలో హెప్సిబా, ఆర్‌జీఎఫ్ కార్యాలయం


పోలీసుల చర్యలు శూన్యం

రెండు సంవత్సరాలుగా పాలకుర్తి కేంద్రంగా అక్రమంగా నడుస్తున్న ఈ సంస్థల్లో నిర్వాహకులు రూ.కోట్లలో పెట్టుడులు పెట్టిస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. అత్యాశకు పోయి నిరుద్యోగులు, అమాయకులు ఇందులో చేరి డబ్బులు పోగొట్టుకున్నా నోరు మెదపడం లేదు. ఈ విషయంపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంస్థపై ప్రారంభంలోనే చర్యలు తీసుకుంటే చాలా మంది ప్రజలు మోసపోయేవారు కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గతంలోనూ పాలకుర్తి కేంద్రంగా దందా..

మల్టీలెవల్ మార్కెటింగ్ వ్యాపారాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన లేకపోవడంతోనే తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో పాలకుర్తి కేంద్రంగా మల్టీలెవల్ మార్కెటింగ్ దందా పేరుతో ప్రజలను మోసం చేసిన సంస్థలు అనేకం ఉన్నాయి. విశ్వజ్యోతి, గురుదేవ, లక్ష్య లాంటి మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి కోట్లాది రూపాయలు పోగొట్టుకున్నారు. అధిక శాతం వడ్డీ ఇస్తామని నమ్మబలికి కొన్ని నెలలపాటు సక్రమంగా చెల్లింపులు చేయడంతో వారిని జనాలు గుడ్డిగా నమ్మారు. ఒకరిని చూసి ఒకరు ఇలా సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఈ మల్టీలెవల్ మార్కెటింగ్ మాయగాళ్ల వలలో పడి మోసపోతున్నారు. ఉన్నదంతా ఊడ్చుకొచ్చి సదరు సంస్థల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఆరు నెలలు తిరిగేలోపే ఆ సంస్థ నిర్వాహకులు బోర్డు తిప్పేసి ఎవరికి కనిపించకుండా పారిపోతుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

రోహిణినిత్యగా శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారు


చంద్రఘంటా అలంకరణలో పద్మాక్షి అమ్మవారు


రోహిణినిత్యగా శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో బుధవారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని రోహిణినిత్యగా అలంకరించి నిత్యాక్లిన్న క్రమంలో పూజలు జరిపారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

చంద్రఘంటా అలంకరణలో పద్మాక్షీ దేవి

హన్మకొండ అర్బన్ : పద్మాక్షీ దేవి చంద్రఘంటా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ పండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. అమ్మవారికి షో దశ కలశాలతో మహానారాయణోపనిషత్తుతో అభిషేకం నిర్వహించి అలంకరించినట్లు తెలిపారు. అనంతరం హోమాన్ని నిర్వహించిన ట్లు పేర్కొన్నారు. దాతలు కీర్తి ఉమెన్ చిల్డ్రన్ హా స్పిటల్ ముక్కా దిలీప్–అర్చన, మాధవరావు–మాధవి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

భద్రకాళికి సింహవాహన, గజవాహన సేవలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఆలయ ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అర్చకులు నిత్యాహ్నికం జరిపి అమ్మవారి మూలమూర్తిని గాయత్రీమాతగా అలంకరించారు. ఉదయం చంద్రఘంటా క్రమంలో దుర్గార్చన జరిపి సింహవాహనంపై, సాయంత్రం మహిషాసురమర్దిని క్రమంలో దుర్గార్చన జరిపి గజవాహనంపై ఊరేగించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. ఆలయ ఈఓ రామల సునీత పర్యవేక్షించారు.


అమ్మవారికి సింహవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

క్లుప్తంగా..

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హసన్‌పర్తి జోన్ క్రీడారులు ఎంపికయ్యారు. ఇటీవల నగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలకు హసన్‌పర్తి జోన్‌కు చెందిన సంతోశ్, గణేశ్, వసంత్, దీక్షిత, అఖిల ఈశ్వరి, సుష్మిత, సమృత పాల్గొని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించారు. బుధవారం నుంచి నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జోన్ చైర్మన్ ఆటికం రవీందర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులను సీనియర్ కబడ్డీ క్రీడాకారులు గడ్డం రమేశ్‌గౌడ్, ఎస్.విక్టర్‌బాబు, లక్ష్మణ్, కిషన్, దేవేందర్, పావనిని అభినందించారు.

7వేల మందికి బోనస్

కాజీపేట రూరల్: రైల్వే ఉద్యోగులకు 78 రోజుల పనితీరు ఆధారిత దసరా బోనస్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు బుధవారం రైల్వే నాయకులు తెలిపారు. అర్హులైన రైల్వే నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు బోనస్ రూ.17,951 చొప్పున రైల్వే చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో వివిధ సెక్షన్లు, విభాగాల్లో పనిచేస్తున్న రైల్వే గ్యాంగ్‌మెన్లు, లోకోపైలెట్లు, రైల్వే గార్డులు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, సాంకేతిక నిపుణులు, సహాయకులు, పాయింట్స్‌మెన్, మినిస్టీరియల్ స్టాఫ్‌కు చెందిన సుమారు 7 వేల మంది బోనస్ తీసుకోనున్నట్లు రైల్వే నాయకులు తెలిపారు.

ఆకట్టుకున్న 'అమ్మ చెక్కిన బొమ్మ'

- కొనసాగుతున్న నాటక ప్రదర్శనలు

హన్మకొండ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎఫ్‌డీసీ వారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న పందిళ్ల శేఖర్ బాబు స్మారక నాటకోత్సవం-25 రెండో రోజుకు చేరుకున్నాయి. ఈమేరకు బుధవారం సాయంత్రం గన్నమరాజు గిరిజామనోహర బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ×కుడా× చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పందిళ్ల శేఖర్‌బాబు తన నటనతో అనేక మందిని మెప్పించి ఆదరాభిమానాలు సంపాదించారని నాటక రంగానికి ప్రాణం పోశారని గుర్తు చేశారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్స్ వారి అమ్మ చెక్కిన బొమ్మ సాంఘిక నాటక ప్రదర్శన, మధిరకు చెందిన సుమిత్రా యూత్ అసోసియేషన్ వారు కస్తూరి తిలకం పద్య నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఖమ్మానికి చెందిన రంగస్థల కళాకారులు ఏఎస్ రంగాచార్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాదారపు సంజీవరెడ్డి, పెండెం రమేశ్ బాబు, డా.వొడపల్లి చక్రపాణి, పందిళ్ల అశోక్ బాబు, కార్యవర్గ సభ్యులు దేవరరాజు రవీంద్ర రావు, మాడిశెట్టి రమేశ్, సీత వెంకటేశ్వర్లు, గూడూరు బాలాజీ, కళాకారులు పాల్గొన్నారు.


అమ్మ చెక్కిన బొమ్మ నాటకంలోని ఓ సన్నివేశం

పీఎఫ్, ఈఎస్ఐ వివరాలు తెలియజేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్

ఎంజీఎం: సీకేఎం ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ వివరాలు తెలియజేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్మికులతో కలిసి ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఎంఓ మురళికి అందజేశారు. ఈ సందర్భంగా గన్నారపు రమేశ్ మాట్లాడుతూ అనేకసార్లు అప్పటి సూపరింటెండెంట్ నిర్మల, ప్రస్తుత సూపరింటెండెంట్ షర్మిలకు విన్నవించుకున్నా కాలయాపన చేసి సమస్యలు పరిష్కరించలేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ లేదా గ్రీన్‌చానల్ ద్వారా ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, ఐడీ కార్డులు, పే స్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీకేఎం హాస్పిటల్ అధ్యక్ష, కార్యదర్శులు కలకోట్ల రాజు, నాగవెల్లి శంకర్, సంధ్య, వీరన్న, లావణ్య, సురేశ్, దేవేందర్, వంశీ, రాజు, పద్మ, సులోచన, స్వరూప, బిందు పాల్గొన్నారు.


ఆర్ఎంఓ మురళికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

29న సద్దుల బతుకమ్మ

హన్మకొండ కల్చరల్: సద్దుల బతుకమ్మ వేడుకలు ఈ నెల 29న నిర్వహించుకోవాలని వరంగల్ శ్రీరాజరాజేశ్వరి దేవాలయ అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 21న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైందని, 9వరోజు సద్దుల బతుకమ్మతో ఉత్సవం ముగుస్తుందని పేర్కొన్నారు.

ఫార్మసీ యాక్ట్ అమలు చేయాలి

- రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పు భాస్కర్‌రావు


ఉప్పు భాస్కర్

ఎంజీఎం: ఫార్మసీ వృత్తిని ప్రభుత్వాలు గుర్తించాలని రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పు భాస్కర్‌రావు అన్నారు. గురువారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. తెలంగాణలో 17 డిప్లొమా, 136 డిగ్రీ, బీఫార్మసీ, 42 ఫార్మ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) కళాశాలలు ఉన్నాయన్నారు. ఫార్మసీ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఫార్మసీ కళాశాలలో బోధన సిబ్బందిగా, డ్రగ్ కంట్రోల్ శాఖలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసీ ఆఫీసర్లుగా, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌ల్లో అనలిస్టులుగా, ప్రైవేట్ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఫార్మసీ యాక్ట్ క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు.

ఘనంగా ఎన్‌డీడీబీ వజ్రోత్సవాలు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని స్వకృషి మహిళా డెయిరీలో బుధవారం నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) వజ్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్‌డీడీబీ జాతీయ వెటర్నరీ హెడ్ శ్రీధర్ మాట్లాడుతూ నాడు కొరియన్ ఆలోచనతో ఏర్పడిన సంస్థ దేశవ్యాప్తంగా క్షీర విప్లవం సాధించిందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా పాలు ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. అందుకు రూ.450 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అనంతరం రాష్ట్ర డెయిరీ ఫెడరేషన్ చైర్మన్ అమిత్ రెడ్డి మాట్లాడుతూ కోపరేటివ్ రంగం ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ముల్కనూరు సొసైటీ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆదర్శవంతంగా సంస్థలు నడుపుతూ కోట్ల రూపాయల వ్యాపారం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సెమినార్‌లో రంగారెడ్డి, నల్లగొండ ఫెడరేషన్, ప్రకృతి డెయిరీ నుంచి సుమారు 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ముల్కనూరు డెయిరీ సక్సెస్‌ను పవర్ ప్రజంటేషన్ ద్వారా ప్రతినిధులకు వివరించారు. అనంతరం డెయిరీలో ఎక్కువ శాతం పాలు పోసిన సభ్యులకు బహుమతులు ప్రదానం చేశారు. నెప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, దక్షిణ భారత రీజనల్ హెడ్ రోమీ జాకబ్, డీసీఓ సంజీవ్, డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జీఎం భాస్కర్ రెడ్డి, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర డెయిరీ ఫెడరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డి

పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరి

నిర్లక్ష్యం వహిస్తే కేంద్ర మోటారు వాహనాల చట్టం ప్రకారం నేరం

- వాహనదారులకు జరిమానా

కాజీపేట : ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని ఆపితే.. హెల్మెట్, లైసెన్స్, వెహికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ)తో పాటు పొల్యూషన్ సర్టిఫికెట్‌ను కూడా అడుగుతారు. పొల్యూషన్ సర్టిఫికెట్ మినహా అన్ని ఉన్నాయని, వదిలేయమని వాహనదారులు చాలా సార్లు అడిగిన సందర్భాలు చూస్తుంటాం. నిజానికి పొల్యూషన్ సర్టిఫికెట్ కచ్చితంగా ఉండాల్సిందే. ద్విచక్ర వాహనం, కారు, లారీ ఇలా ఏ వాహనమైనా రోడ్డెక్కాలంటే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ (పీయూసీ) అవసరం. చాలా మంది పొల్యూషన్ సర్టిఫికెట్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మోటారు వాహన చట్టం ప్రకారం ఇది నేరం. దీనికి జరిమానా చెల్లించాల్సిందే. అసలు ఈ పొల్యూషన్ సర్టిఫికెట్ ఎందుకు అవసరం? ఇది ఎంత కాలం చెల్లుబాటు అవుతుంది? ఈ సర్టిఫికెట్‌లో ఏ వివరాలు ఉంటాయి? ఎంత చెల్లించాలో తెలుసుకుందాం..



పీయూసీ అంటే?

పీయూసీ అంటే పొల్యూషన్ అండర్ కంట్రోల్ అని అర్థం. రోడ్డుపై వాహనం వెళ్లడం వల్ల అందులోనుంచి వచ్చే పొగలో కార్బన్ మోనాక్సైడ్ ఎంత ఉంది.. దాని వల్ల పర్యావరణానికి ఏ మేరకు హాని కలిగే అవకాశం ఉంది.. గాలి ఎంత శాతం కలుషితమవుతుంది తదితర వివరాలతో సరిచూసి వాహనాన్ని నడిపేందుకు ఇచ్చే అనుమతి పత్రం ఇది. దేశ, రాష్ట్ర రోడ్డు రవాణా విభాగం నిర్దేశించిన యూనిట్లలోపు ఉంటేనే పొల్యూషన్ సర్టిఫికెట్ (పీయూసీ) ఇస్తారు. వాహనం ఇంజన్ నుంచి వెదజల్లే పొగ ద్వారా కాలుష్యం ఏ మేరకు వస్తుందో ఈ సర్టిఫికెట్‌లో నమోదు చేస్తారు. కేంద్ర మోటారు వాహన చట్టం-1989 ప్రకారం ప్రతి వాహనానికి సర్టిఫికెట్ తీసుకోవాల్సిందే.

పీయూసీ ఎప్పుడిస్తారు..

వాహనం కొనుగోలు చేసిన ఏడాది తర్వాత పీయూసీ తీసుకోవాలి. ఎందుకంటే ప్రతి వాహనం పీయూసీ పరీక్ష చేసి సంవత్సరం పాటు ఎలాంటి సమస్య లేదని తేలితేనే ఆ వాహనాన్ని సదరు కంపెనీ విక్రయిస్తుంది. పీయూసీ ఆరునెలలు చెల్లుబాటు అవుతుంది. ఈ తర్వాత మళ్లీ తీసుకోవాలి. ఈ పరీక్షకు రూ.60నుంచి రూ.100 వరకూ చెల్లించాలి.

నమోదు చేసే వివరాలు..

పొల్యూషన్ సర్టిఫికెట్ సీరియల్ నంబర్, టెస్టు చేసిన తేదీతోపాటు ఎప్పటి వరకు పీయూసీ చెల్లుబాటు అవుతుందో తేదీ, పొల్యూషన్ రీడింగ్ వివరాలు ఈ సర్టిఫికెట్‌లో పొందుపరుస్తారు. ఈ పీయూసీ పరీక్షా కేంద్రాలు ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల్లోనూ మొబైల్ వాహనాల్లో నిర్వహించి సర్టిఫికెట్ ఇస్తారు.

గ్యాస్ లీకైందా.. డయల్ 1906



కాజీపేట : వంట గ్యాస్ సిలిండర్ వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలకు ఆస్కారం ఉంది. మహిళలు ఎప్పటికప్పుడు సిలిండర్‌ను కదపడం, ప్రతీసారి రెగ్యులేటర్ సరిచేయడం వంటివి చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో పాటు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలకు అవకాశం ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు.

గ్యాస్ లీకేజీకి కారణాలు..

రెగ్యులేటర్‌ను సిలిండర్‌కు అనుసంధానం చేసేటప్పుడు రబ్బర్ వాషర్ (ఓరింగ్) కొన్నిసార్లు సరిగా అమర్చి ఉండదు. దీంతో రెగ్యులేటర్‌ను బిగించగానే సిలిండర్ నుంచి గ్యాస్ బయటకు వచ్చే చాన్స్ ఉంది. ఇది ఏజెన్సీ ప్రతినిధి మాత్రమే సరిగా వేయగలరు. ఇక రెగ్యులేటర్ నుంచి స్టవ్‌కు సురక్ష ట్యూబ్ ఉంటుంది. దాని కాల పరిమితి ఐదేళ్లు..పరిమితి దాటిన తర్వాత కచ్చితంగా కొత్త ట్యూబ్ తీసుకోవాలి. లేకపోతే దాని ద్వారా కూడా గ్యాస్ లీకయ్యే అవకాశం ఉంటుంది. ఏ ప్రదేశంలోనైనా గ్యాస్ లీక్ అయితే వెంటనే సంబంధిత ఏజెన్సీల అత్యవసర నంబర్‌కు గాని, టోల్‌ఫ్రీ నంబరు 1906 కాని ఫోన్‌చేయాలి. వెంటనే అక్కడి నుంచి మెకానిక్ వచ్చి సమస్య పరిష్కరిస్తారు. అందుకు వినియోగదారుడు ఎటువంటి నగదు ఇవ్వాల్సిన అవసరం లేదు.

పీడీసీ చెక్ చేసుకోవాలి..

గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి సిలిండర్ ఇచ్చిన వెంటనే వినియోగదారుడు పీడీసీ (ప్రీ డెలివరీ చెక్) చేయించుకోవాలి. 'మా కర్తవ్యం..మీ బాధ్యత' అనే నినాదంతో ఉన్న వాచర్ చెక్ చేసుకోవాలి. అనంతరం ఇంట్లో రెగ్యులేటర్‌ను అమర్చి చూసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

గ్యాస్ వాసన గుర్తించిన వెంటనే ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి పెట్టాలి. ఎలక్ట్రికల్ స్విచ్‌లు వేయడం, ఆర్పడం కాని చేయకూడదు. వెంటనే ఎమర్జెన్సీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. చిన్నారులు, వృద్ధులను దూరంగా ఉంచాలి. గదిలో ఎల్లప్పుడు గాలి బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.


పోలీస్ కమిషనరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

వరంగల్ లీగల్/వరంగల్ క్రైం/వరంగల్ అర్బన్: వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో, పోలీస్ కమిషనరేట్‌లో, గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన జడ్జి వీబీ నిర్మలాగీతాంబ హాజరై బతుకమ్మ వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. వేడుకల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, ప్రధాన కార్యదర్శి డి.రమాకాంత్, రేపూరి శశిరేఖ, అరుణ, నిర్మల జ్యోతి, నాగేంద్ర, సుకన్య, కవిత, న్యాయవాదులు, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో కమిషనరేట్ లో పనిచేస్తున్న మహిళా అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పోలీస్ కమిషనర్ సతీమణి డాక్టర్ దీప్తి హాజరయ్యారు. ఈసందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. బల్దియా కార్యాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు, మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడి సందడి చేశారు.



బల్దియా కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సీపీ సన్‌ప్రీత్ సింగ్, మహిళా పోలీస్ అధికారులు


వరంగల్ జిల్లా కోర్టులో బతుకమ్మ సంబురాల్లో జిల్లా ప్రధాన జడ్జి వీబీ నిర్మలాగీతాంబ


నృత్యం చేస్తున్న ఎంపీ కడియం కావ్య, మేయర్, కమిషనర్